క్లుప్తంగా

కులసంఘ భవనాలకు ప్రొసీడింగ్‌లు అందజేత


ప్రొసీడింగ్ అందజేస్తున్న మంత్రి కొప్పుల

ధర్మపురి: మండలంలోని ఉమ్మడి నేరెళ్ల, గోవిందులపల్లె మున్నూర్ సంఘాల నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం రూ.5 లక్షల విలువ గల ప్రొసీడింగులను అందజేశారు. ప్రొసీడింగ్‌పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోవిందుపల్లె సర్పంచ్ పురంశెట్టి రాజన్న, ఉమ్మడి గ్రామాల అధ్యక్షులు కాశెట్టి మల్లేశం, జాజాల మల్లేశం, జాజాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి


పనులు పరిశీలిస్తున్న మోర హన్మండ్లు

రాయికల్: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. పట్టణంలో జరుగుతున్న సీసీరోడ్లు, చెరువుపై నిర్మిస్తున్న మత్తడి నిర్మాణ పనులు, రామాజీపేట, మైతాపూర్ వంతెన నిర్మాణ పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో పాటు, వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్ గౌడ్, కన్నక మహేందర్, మైనార్టీ యూత్ నాయకులు హుస్సేన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు


జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల: ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె ఎల్లం అన్నారు. ఆదివారం ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపారులకు జరిమానా వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించిందని, ఎవరు కూడా వాడకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను వాడకుండా చూడాలన్నారు. నిత్యం తనిఖీలు చేసి జరిమానా విధిస్తామన్నారు. తనిఖీల్లో కాంట్రాక్ట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాము, అశోక్, గోపాల్, బాబు, విష్ణు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి


కిరాణం షాపును పరిశీలిస్తున్న ఏపీఎం

జగిత్యాలరూరల్: మహిళ సంఘాలు తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి పొందాలని ఐకేపీ ఏపీఎం గంగాధర్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీలో మహిళ సంఘాలు తీసుకున్న రుణాలతో ఏర్పాటు చేసిన యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సంఘాలు తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచెపు రాజమణి, సీసీ గంగారాం, వీవో అధ్యక్షురాలు బోదాసు రాధ పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో కల్యాణ మండపం నిర్మాణానికి ఏసీడీపీ నిధులు రూ.5 లక్షలు మంజూరు కాగా, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రొసీడింగ్ పత్రాన్ని ఆదివారం గ్రామస్తులకు అందించారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకటి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాలకు దూప,దీపం నైవేద్యం

కోరుట్ల: నియోజకవర్గంలో ఇరవై ఆలయాలకు దూప,దీపం,నైవేద్యం పథకం వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు.

ఆసక్తి ఉన్నా.. అందని కంప్యూటర్ విద్య

- పాఠశాలల్లో మూలనపడ్డ కంప్యూటర్లు
- కంప్యూటర్ విద్యకు నోచుకోని విద్యార్థులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా కంప్యూటర్లు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు కంప్యూటర్ విద్యను బోధించాలని గతంలో ప్రభుత్వం సక్సెస్ పాఠశాలలను గుర్తించి కంప్యూటర్ విద్యను ప్రారంభించింది. అధికారులు 2008లో ఇబ్రహీంపట్నం, గోధూర్, వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సక్సెస్ పాఠశాలలుగా గుర్తించి కంప్యూటర్ బోధనకు శ్రీకారం చుట్టారు. ఒకొక్క పాఠశాలకు రూ.5 లక్షలు వెచ్చించి 11 కంప్యూటర్లను, ఫర్నీచర్, జనరేటర్లు సమకూర్చారు. ఎన్ఐటీ ఆధ్వర్యంలో ప్రారంభ దశలో 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణను ఇచ్చారు. 2013 సెప్టెంబర్ నుంచి ఎన్ఐటీ కాంట్రాక్ట్ రద్దు కావడంతో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేవారు కరువయ్యారు. అ తరువాత విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అయినప్పటికీ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వకపోవడంతో విద్యార్థులు కంప్యూటర్ విద్య అందడం లేదు. కంప్యూటర్ కోర్సు నేర్చుకోవాలని కోరిక ఉన్నప్పటికీ నేర్పేవారు లేకపోవడంతో వేలాది రూపాయలు ఖర్చు పెట్టి బయట ప్రైవేట్‌గా శిక్షణ పొందుతున్నారు. కంప్యూటర్ శిక్షణ ఇచ్చేవారు లేకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి పెట్టిన కంప్యూటర్లు, జనరేటర్లు, పనికి రాకుండా పాఠశాలల్లో మూలన పడవేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి ఈ విద్యా సంవత్సరం నుంచైనా పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షకులను నియమించి చదువుతో పాటు కంప్యూటర్ విద్యను నేర్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేర్చుకోవాలని ఉంది



నేను పదో తరగతి చదువుతున్నాను. నాకు కంప్యూటర్ విద్య నేర్చుకోవాలని ఉంది. శిక్షణ ఇచ్చే వారే లేరు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విద్యార్థులకు కంప్యూటర్ బోధకుడిని నియమించి శిక్షణ ఇప్పించాలి. – కె. స్వాతి, పదో తరగతి విద్యార్థి, ఇబ్రహీంపట్నం

పునఃప్రారంభించాలి



ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచైనా విద్యార్థులకు చదువుతో పాటు కంప్యూటర్ శిక్షణ ఇవ్వాలి. ఈ రోజుల్లో కంప్యూటర్ విద్య అనేది విద్యార్థులకు చాలా అవసరం.
– జి. హర్షిక, 9వ తరగతి విద్యార్థి, ఇబ్రహీంపట్నం

శిక్షకులను నియమించాలి



విద్యార్థులకు కంప్యూటర్ విద్య నేర్చుకోవాలని ఆసక్తి ఉంది. శిక్షకులను నియమించి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను నేర్పించాలి. విలువైన కంప్యూటర్లు, జనరేటర్లు మూలనపడి చెడిపోతున్నాయి.
–గణేశ్, హెచ్ఎం, జెడ్పీహెచ్, ఇబ్రహీంపట్నం

చర్యలు తీసుకుంటాం



విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఎన్ఐటీ వాళ్లకు గతంలో 5 ఏళ్ల మాత్రమే ఒప్పందం ఉండేది. ఒప్పందం పూర్తయిన తర్వాత శిక్షకులు లేక విద్యార్థులకు శిక్షణ ఇవ్వలేకపోయాం. – ఆనందరావు, ఇన్‌చార్జి, ఎంఈవో ఇబ్రహీంపట్నం

ఊరూరా మంచినీళ్ల పండుగ


మేడిపెల్లిలో ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్


రామాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



బండలింగాపూర్‌లో గ్రామస్తుల ర్యాలీ

మల్లాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఊరురా మంచినీళ్ల పండుగను ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల వద్ద రంగుల రంగుల ముగ్గులతో ప్రత్యేకంగా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేటలో మంచినీళ్ల పండగ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగు నీటి ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి రమాదేవి, ఉపసర్పంచ్ హరీశ్ రావు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మేడిపెల్లి, భీమారం మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. మంచినీళ్ల వినియోగంపై ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలుపాల్గొన్నారు.

పెగడపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, అధికారులు ర్యాలీగా మిషన్ భగీరథ ట్యాంకుల వద్దకు చేరుకున్నారు. మంచినీటి సరఫరా జరుగుతున్న తీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మండలంలోని గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ర్యాలీలు చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మంచినీళ్ల పండుగ కార్యక్రమం నిర్వహించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, సర్పంచులు కూన సులోచన, ధరావత్ సరోజ, పోతు సింధూజ, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక వాటర్ ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద ప్రజలకు భగీరథ నీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో వెంకటేశం, మిషన్ భగీరథ ఏఈ హరిప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


బీజేపీలో చేరిన యువకులు, మహిళలు

కోరుట్ల: ప్రధాని మోదీ సుపరిపాలనకు ఆకర్షితులై ప్రజలు బీజేపీలో చేరుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ అన్నారు. బీజేపీ మల్లాపూర్ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, మహిళలు ఆదివారం కోరుట్ల పట్టణంలోని కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి నవీన్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యూసుఫ్‌నగర్ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు మధు, బీజేపీ సీనియర్ నాయకులు పీసరి నర్సయ్య, సాగూరు దేవయ్య,బత్తుల శ్రీనివాస్, రాజేందర్, దేవీలాల్, దామోదర్, గంగాధర్, మెట్‌పల్లి మండల నాయకులు తిరుమల్, గుంటుక నాగరాజు పాల్గొన్నారు.

'మీడియా గొంతు నొక్కుతున్న మంత్రి'

వెల్గటూర్: మంత్రి కొప్పుల ఈశ్వర్ పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ జర్నలిస్టులపై బహిరంగంగా విషం చిమ్ముతూ, మీడియా గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గజ్జెల స్వామి అన్నారు. ఆదివారం వెల్గటూర్‌లో మాట్లాడారు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామ శివారులో నిర్మించనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకిస్తూ ప్రజలు చేస్తున్న పోరాటాన్ని పత్రికల్లో రాస్తున్న జర్నలిస్టులను విమర్శించడం మంత్రి స్థాయికి తగదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర ఏర్పాటులో భాగమైన జర్నలిస్టుల గొంతు నొక్కాలని చూస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పదవి శాశ్వతం కాదని, మీడియా పట్ల అణిచివేత ధోరణి ప్రదర్శించిన ప్రభుత్వాలు సైతం కాలగర్భంలో కలిసిపోయాయని హెచ్చరించారు. జర్నలిస్టులకు కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కొమురయ్య, అజయ్, బాల్‌రెడ్డి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు


విక్టరీ సింబల్‌తో విద్యార్థులు, నరేందర్‌రెడ్డి

జగిత్యాల: పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని అల్ఫోర్స్ కళాశాల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ 2023 ఫలితాలు విడుదల కాగా, అల్ఫోర్స్ కళాశాలకు చెందిన విశ్వనాథ్ వేణుగోపాల్ 2363, ఇనుగుర్తి అన్విత్‌సాయి 7700 ర్యాంకులతో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత అభినందించారు. విద్యార్థులు ఒక గోల్ ఏర్పాటు చేసుకుని దానిని సాధించే దిశగా ప్రయత్నించాలన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో గోదావరి పుష్కరఘాట్ గంగమ్మ ఆలయం వద్ద షెడ్ నిర్మాణానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ దాతల సహకారంతో షెడ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాంపెల్లి వెంకటాద్రి, ఉపసర్పంచ్ ఆసతి పెద్దరాజం, నాయకులు సున్నం సత్యం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కోరుట్ల: పట్టణంలోని దేవా ఆక్యూపంక్చర్, ఆయుర్వేదిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు లక్ష్మీ నరేశ్, నరేశ్ వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆక్యూ పంక్చర్ వైద్యంపై అవగాహన కల్పించారు.

గుంత పూడ్చివేత

సాక్షి స్పందన


పూడ్చివేసిన గుంత

పెగడపల్లి: మండల కేంద్రంలోని నందిచౌరస్తా వద్ద బీటీ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను సంబంధిత అధికారులు శనివారం సాయంత్రం పూడ్చి వేయించారు. 'ప్రమాదకరంగా గుంత..పట్టించుకునే వారేరీ?' శీర్షికన ఈనెల 17న సాక్షిలో ప్రచురితమైంది. ఈ మేరకు మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టి రహదారిపై ఏర్పడిన గుంతను పూడ్చి వేశారు. దీంతో సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాగునీటి రంగానికి సీఎం పెద్దపీట


ఊర చెరువు వద్ద ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, నాయకులు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో భూగర్భజలాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయడంతో పాటు, సాగునీటి రంగాలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల అర్బన్ మండలం మోతెలో ఊర చెరువు వద్ద రూ.14 లక్షలతో నిర్మించే మత్తడి నిర్మాణానికి ఎమ్మెల్సీ రమణతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని చెరువులు, కుంటలను మిషన్ కాకతీయతో అభివృద్ధి చేసి నీటి నిలువలు పెంచేందుకు కృషి చేశారన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్ట్‌లు నిర్మాణం చేసి బీడు భూములను సాగుభూములుగా సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సాగునీటి రంగం అగ్రగామిగా నిలిచిందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ మోతె చెరువు వద్ద పర్యాటక అభివృద్ధి కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కులవృత్తుల వారికి అండగా నిలుస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి, జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ జుంబర్తి శంకర్, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ అబ్దుల్‌ఖాన్,నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి అధికారులపై ఆగ్రహం

జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో ఊర చెరువు మత్తడి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వస్తుండగా సాగునీటి అధికారులు అక్కడకు చేరుకోగానే వారిపై ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలల క్రితం మత్తడి తెగిపోగా అధికారులు బిల్లులు చెల్లిస్తామని ట్రాక్టర్లతో మట్టి తరలించి బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని, తమ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు రాసి ఇచ్చిన ఒప్పంద పత్రాన్ని చూపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పావని కంటి ఆస్పత్రి,ఆపీ రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ ఉచిత కంటి ఆపరేషన్లు చేసి అద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో డా విజయ్, కౌన్సిలర్ కూసరి అనిల్, సర్పంచ్ బుర్ర ప్రవీణ్‌గౌడ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తల్లిదండ్రులను గౌరవించాలి

జగిత్యాల: తల్లిదండ్రులను ప్రతి ఒక్కరు గౌరవించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం ఫాదర్స్‌డే సందర్భంగా తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బిడ్డలను కనిపెంచి ఎన్నెన్నో త్యాగాలు చేసి తల్లిదండ్రులు ఉన్నతస్థానాలకు తీసుకెళ్తే వారిని పట్టించుకోవడం లేదన్నారు. ఎప్పుడైనా, ఎవరైనా తల్లిదండ్రులను గౌరవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్.దేశాయి, రాంగోపాల్, హన్మంతరెడ్డి, యాకూబ్, గౌరిశెట్టి విశ్వనాథం, కరుణ, శంకర్‌రావు పాల్గొన్నారు.

మల్యాలలో పిల్లల వైద్య శిబిరం

మల్యాల: మండల కేంద్రంలో ఆదివారం పిల్లల వైద్య నిపుణులు అర్జున్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన సుమారు 150 మంది పిల్లలకు శిబిరంలో పరీక్షలు నిర్వహించారు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు అర్జున్‌ను సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆసం శివకుమార్, కార్యదర్శి గుండేటి రవీందర్, వార్డు సభ్యుడు మున్నా తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం

కోరుట్ల: పట్టణంలో కోరుట్ల లెజెండ్ క్రికెట్ సర్కిల్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్‌గా వైస్టార్ జట్టు, రన్నరప్‌గా కేపీఎల్ లెజెండ్ జట్లు నిలిచాయి. విజేతలకు ఆదివారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా మహమ్మద్ హర్షద్ నిలిచాడు. కార్యక్రమంలో మహమ్మద్ రిజ్వాన్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు రజియొద్దీన్, రఫీయుద్దీన్, నసీరుద్దీన్, మజీద్, సాజీద్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

జగిత్యాల జోన్: జిల్లా కేంద్రంలోని శివగాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి పెగడపల్లి మండలం వెంగళాయిపేట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దంపతులు నేరెల్ల నగేశ్–స్వప్న సామాజిక సేవకులు బత్తుల ప్రదీప్ ద్వారా ఆశ్రమ నిర్వాహకులు సూరజ్ శివశంకర్‌కు రూ.5 వేల నగదును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో చేవెల్ల సుమన్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కొడిపెల్లి రాజుకు నెలరోజుల క్రితం పాప జన్మించగా.. వైద్యం కోసం వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత గోలి మోహన్ ఆదివారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. పాప గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ కరీంనగర్‌లో చికిత్సపొందుతుండగా, ఆసుపత్రికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు.

నేడు రాయికల్‌లో జగన్నాథ రథయాత్ర

రాయికల్: పట్టణంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జగన్నాథస్వామి రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రమేశ్, నరేందర్ ఆదివారం తెలిపారు. భీమన్న గుడి నుంచి గాంధీ చౌక్, పటేల్ విగ్రహం, శివాజీ విగ్రహం, గుడికోట వరకు రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం

గొల్లపల్లి: మండలంలోని లొత్తునూర్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఆకుల సుమన్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా లక్కం లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కుంటాల తిరుపతి,యూత్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మగాని ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా లక్కం మణి, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి వంశీ, కార్యదర్శిగా బొంగోని జీవన్,కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కొప్పు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గుంటుకుల చందు, బీసీ సెల్ అధ్యక్షుడిగా బైరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా దావనపెల్లి రవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడి లక్కం తిరుపతి,ఉపాధ్యక్షుడిగా మద్దెల ప్రభాకర్, ఇతర కార్యవర్గ సభ్యులను నియమించారు.

ఔట్ సోర్సింగ్ యూనియన్ కార్యవర్గం..

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని వెటర్నరీ కళాశాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా మహమ్మద్ నజ్మోద్దీన్ ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా నజ్మొద్దీన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సహకారంతో కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ ,ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కార్తీక్ గౌడ్, కోశాధికారి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి రాయికల్ క్లబ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సూర్యప్రకాశ్, సత్యనారాయణ, రాజమౌళి, రాజేందర్, శ్రీనివాస్, పవన్‌కుమార్‌లను సన్మానించారు. అనంతరం పాఠశాలలో చేసిన అల్లర్లు గుర్తు చేసుకున్నారు.